9న జిల్లా సమీక్షా సమావేశం

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లా సమీక్షా కమిటీ (డిఆర్ సి) సమావేశం ఈ నెల 9న నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధ్యక్షతన సమావేశం జరుగుతుందని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారని ఆయన తెలిపారు. అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆదేశించారు. సమావేశంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాత్సవ, డిఆర్ఒ కె.హేమలత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజారక్షణ భేరీలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర నాయకులు బివి రాఘవులు, విఎస్ఆర్ (ఫైల్)

ఎర్రజెండా నీడలో అలుపెరుగని పోరాటాలు

- రైతన్నకు వెన్నుదన్నుగా సిపిఎం ఉద్యమాలు
- నిర్వాసితులు, ఉపాధి కూలీలకు కొండంత అండ
- నిర్బంధాలను ఎదురించి మొక్కవోని దీక్షతో ముందుకు
- 10,11న సిపిఎం పదో జిల్లా మహాసభ

ఓవైపు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్బంధాలు.. ఇంకోవైపు మతోన్మాదుల ఆగడాలు.. వీటన్నింటినీ ఎదుర్కొంటూనే ప్రజా, ఉద్యోగ, కార్మిక, కర్షక సమస్యలను పరిష్కరించేందుకు గత మూడేళ్ల కాలంలో పార్వతీపురం మన్యం జిల్లాలో సిపిఎం, ఆ పార్టీ ప్రజాసంఘాలు శక్తి మేర పోరాటాలు నిర్వహించాయి. ముఖ్యంగా రైతులకు వెన్నుదన్నుగా నిలిచాయి. చెరకు బకాయిలు చెల్లించాలని, వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని, మద్దతు ధర అమలు చేయాలని, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పెంచాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని, ఉపాధి కార్మికులకు పనిదినాలు పెంచాలని, గిరిజనులకు నష్టం కలిగించే బడిదేవర కొండ తవ్వకాలు ఆపాలని పెద్దఎత్తున పోరాడింది. ప్రజా రక్షణ భేరీ, సమర భేరీ పేరిట జిల్లా వ్యాప్తంగా సిపిఎం జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు సైతం జిల్లాలో పర్యటించి ప్రజల్ని జాగృతపర్చారు. కీలక సమస్యలపై పోరాడి పలు విధాలుగా న్యాయం చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల 10,11 తేదీల్లో కురుపాంలో జరుగనున్న పార్వతీపురం మన్యం జిల్లా 10వ మహాసభ సందర్భంగా గడిచిన మూడేళ్ల కాలంలో సిపిఎం నిర్వహించిన పోరాటాలు, సాధించిన విజయాలను గుర్తు చేసేదే ఈ కథనం.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం చెరకు బకాయి చెల్లించి, వెంటనే క్రషింగ్ ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, రైతుసంఘంతో కలిసి బలమైన ఉద్యమం నిర్వహించింది. ప్రధాన రహదారి స్తంభింపజేయడంతో దిగివచ్చిన ప్రభుత్వం, ఫ్యాక్టరీ యాజమాన్యం బకాయి చెల్లించాయి. ఈ పోరాట సమయంలో సిపిఎం నాయకులను, రైతులను ప్రభుత్వం ఐదు రోజులపాటు జైలులో పెట్టింది. జిల్లాలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని, మద్దతు ధర చెల్లించాలని సిపిఎం ఆధ్వర్యాన సచివాలయాలు, తహశీల్దార్ కార్యాలయాలు ధర్నాలు చేపట్టారు. సబ్ కలెక్టర్ కార్యాలయానికి పాదయాత్రగా వెళ్లి 2 రోజులపాటు నిరాహారదీక్షలు చేపట్టారు. దీంతో, చాలా మంది రైతులకు న్యాయం జరిగింది. నష్టపోయిన జీడిమామిడి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సామూహిక దరఖాస్తుల ఉద్యమం, వివిధ రూపాల్లో ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించింది. దీంతో, కేంద్ర ప్రభుత్వం తరపున ప్రత్యేక బృందం కదిలి వచ్చింది. జిల్లాలో కరువు మండలాలను ప్రకటించాలని రైతు సంఘంతో కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచింది. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రభుత్వ యోచనకు వ్యతిరేకంగా రైతులను సమీకరించి పోరాడింది.

నిర్వాసితులకు అండగా...

కురుపాం గిరిజన ఇంజినీరింగ్ కాలేజీ నిర్వాసిత గిరిజనులకు నష్ట పరిహారం చెల్లించాలంటూ ఆనేక రూపాల్లో చేపట్టిన ఆందోళనలకు అప్పటి వైసిపి ప్రభుత్వం దిగివచ్చింది. చర్చలు జరిపి భూమి బదులు భూమి ఇవ్వడానికి అంగీకరించింది. దీని అమలు కోసం మరో పోరాటానికి సిద్ధమైంది. అంతకు ముందు పెద్దగెడ్డ, తోటపల్లి నిర్వాసితుల కోసం పోరాడి మెరుగైన పరిహారం, పునరావాసం కల్పించిన సంగతి విధితమే.

ఉపాధి కూలీలకు ఆసరా

ఉపాధి పనులను రెండు పూటల పెట్టడాన్ని వ్యతిరేకిస్తూనే ఏడాదికి 200రోజులపాటు పనులు కల్పించాలని, కనీస వేతనం రూ.600 వచ్చే విధంగా ప్రభుత్వ విధానం రూపొందించాలని ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట వివిధ రూపాల్లో ఉపాధి కూలీలతో కలిసి ధర్నాలు చేపట్టింది. వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులు, కౌలు రైతుల సమస్యలపై సైతం శక్తి మేర పోరాడింది.

పట్టణ ప్రాంత సమస్యలపై...

పార్వతీపురం, సాలూరు, పాలకొండ తదితర మున్సిపల్, పట్టణ కేంద్రాల్లో చెత్తపన్ను, విలువ ఆధారిత ఆస్తిపన్ను తదితర ఆర్థిక భారాలకు వ్యతిరేకంగానూ సిపిఎం గళం వినిపించింది. ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టాలని, ఉచితంగా ప్రజలకు అందజేయాలని డిమాండ్ చేస్తూ దీక్షలు చేపట్టింది. ఇందులో ప్రజలు, వివిధ సంఘాలు విశేషంగా భాగస్వామ్యం అయ్యారు. ప్రజలకు భారంగా మారే పెరిగిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సిపిఎం తొలి నుంచీ పోరాడుతోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ప్రజలతో సంతకాలు సేకరణ, పట్టణాల్లో సదస్సులు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించింది.

నిర్బంధాలను ఎదురించి...

దళితులపై దాడులు, వేధింపులకు గురిచేసిన వారిపై కెవిపిఎస్ నాయకులతో కలిసి పోరాడింది. ఈనేపథ్యంలో పార్టీ, కెవిపిఎస్ నాయకులపై తప్పుడు కేసులు బనాయించి, నిర్బంధాలకు పాల్పడ్డారు. వివిధ రూపాల్లో నిరసన కొనసాగించడం వల్ల దిగి వచ్చిన ఎస్‌పి పక్షపాతంగా వ్యవహరివంచిన ఎస్ఐపై చర్య తీసుకుని, సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బొబ్బిలి గోత్ సెంటర్ మైథాన్ కార్మికుల పోరాటం పార్వతీపురం, విజయనగరం జిల్లాకు చెందిన సిపిఎం నాయకులపై అప్పటి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి, 45రోజులపాటు సెంట్రల్ జైలుకు పంపింది. నాయకులు, కార్మికులు వెనక్కి తగ్గకపోవడంతో సమస్య పరిష్కారమైంది. మరోవైపు పార్వతీపురం మండలంలోని బడిదేవర కొండ తవ్వకాలకు వ్యతిరేకంగా గిరిజనులను ఐక్యం చేసి పోరాడింది. సిహెచ్‌డబ్ల్యూలు, గ్రీన్ అంబాసిడర్లు, సంఘటితేతర అసంఘటిత రంగ కార్మికులు, ముఖ్యంగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆయా, మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు వంటి స్కీమ్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి సిపిఎం అలుపెరుగని పోరాటాలు నిర్వహించింది.

ప్రజారక్షణ భేరీ

ఈకాలంలో సిపిఎం సమర భేరీ, ప్రజా రక్షణ భేరీ పేరిట రెండు దఫాలుగా పెరిగిన ధరలు, వివిధ రూపాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేసిన భారాలపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ప్రచార యాత్ర నిర్వహించింది. ప్రాంతాలు, రంగాలు వారీగా కీలక సమస్యలను గుర్తించి, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు మరో యాత్ర నిర్వహించింది. ప్రజల్ని భాగస్వామ్యం చేస్తూ పలు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసింది. ఈ కార్యక్రమాల్లో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

CPM 10 పార్వతీపురం మన్యం జిల్లా వ మహాసభలు డిసెంబర్ 10,11, కురుపాం

మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్‌లో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

విద్యారంగానికి రూ.14 వేల కోట్లు

పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

విద్యారంగానికి ప్రభుత్వం ఏటా రూ.14 వేల కోట్లు వెచ్చిస్తోందని పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం పార్వతీపురం మండలం నర్సిపురంలో నిర్వహించిన మెగా పేరెంట్స్ డే సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. తల్లిదండ్రులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు బంగారు భవిష్యత్తును అందించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తోందన్నారు. పిల్లలను చదువు వైపు ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి మౌలిక సదుపాయాలు ఉన్నాయని, ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. దేశానికి ఉపయోగపడే పౌరులను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. భావి పౌరుల కోసం ప్రభుత్వం తాగునీరు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంతో పాటు మరెన్నో అందజేస్తోందని తెలిపారు. గత ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా రూ.4 వేల కోట్లు విడుదల చేస్తున్నప్పటికీ, పాఠశాలల్లో మౌలిక వసతులు కనిపించడం లేదన్నారు. తల్లిదండ్రులు పిల్లలను క్రీడలు, పర్యావరణాభివృద్ధికి అనుమతించాలని, డ్రగ్స్‌కు గురికాకుండా చూడాలని మంత్రి కోరారు. పంచాయతీల పని వ్యవస్థ, పౌరుని బాధ్యతలను పెంపొందించడానికి పాఠశాలల్లో 'బాల పంచాయితీ' భావనను అనుసరించాలని సూచించారు. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 1590 పాఠశాలలు ఉన్నాయని, 95 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. జిల్లాలో మై స్కూల్ మై ప్రైడ్ కార్యక్రమాన్ని చేపట్టి పిల్లలకు సలహాలు, మార్గనిర్దేశం చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను సాధించాలని కలలు కంటూ స్థానికంగా విద్యాసంస్థలను నెలకొల్పేందుకు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో నెగ్గిన విద్యార్థులకు సత్కారాలు చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి కలెక్టర్ మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ, సబ్ డివిజనల్ పోలీసు అధికారి అంకిత సురాన, అధికారులు పాల్గొన్నారు.

మంత్రికి ఘన స్వాగతం

సీతానగరం : మండలంలోని లచ్చయ్యపేట వద్ద మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఎమ్మెల్యే విజయ్‌చంద్ర, కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. రైస్‌మిల్లర్లు మంత్రికి స్వాగతం పలికి, వారి సమస్యలను విన్నవించుకున్నారు ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు ఆర్.వేణుగోపాల్ నాయుడు, వి.గుంపుస్వామి టి.అప్పలనాయుడు, పగిలి నాగభూషణం పాల్గొన్నారు.

కొత్త ఆలోచనలతో ముందుకు రావాలి

రైతులతో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మంచి దిగుబడి, ఆదాయాన్ని పొందడానికి మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో కొత్త ఆలోచనలు, కొత్త సంస్కరణలతో ముందుకు రావాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులకు సూచించారు. శనివారం పార్వతీపురం మండలం పెదబొండపల్లి పొలాల్లో ధాన్యాన్ని మంత్రి పరిశీలించారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు పరికరాలను పరిశీలించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుపై ఆరాతీశారు. రైతులకు సబ్సిడీపై టార్పాలిన్లు అందించామన్నారు. రైతుల సమస్యలు ప్రభుత్వానికి తెలుసని, ఆర్థికంగా భారం ఉన్నప్పటికీ తనవంతు కృషి చేస్తోందని చెప్పారు. తమ భూములకు శాశ్వత ఆధారమైన జంఝావతి ప్రాజెక్టును పూర్తి చేయాలని రైతులు మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

అగ్నిపథ్‌లో చేరాలి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

యువత అగ్నిపథ్‌లో చేరేలా అడుగులు వేయాలని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అథారిటీ కార్పొరల్ సందీప్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని అగ్నిపథ్, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అగ్నిపథ్‌లో చేరిన వారికి నాలుగు సంవత్సరాల ఉద్యోగ కాలపరిమితి, 25 శాతం ఉద్యోగ భద్రత ఉంటుందని తెలిపారు. ప్రతిఒక్కరూ ఉద్యోగాలు సాధించి భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సార్జెంట్ ఎస్.డి.ఝూట్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి డి.మంజులవీణ, ప్రిన్సిపల్ జె.రామారావు పాల్గొన్నారు.

పోరాటాన్ని ఉధృతం చేస్తాం

స్పష్టంచేసిన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం

మంత్రితో మాట్లాడుతున్న అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-పార్వతీపురం

గిరిజన అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల, అధ్యాపకుల సమస్యల పరిష్కారంలో గిరిజన మంత్రి, గురుకుల అధికారుల తీరు అభ్యంతరకరంగా ఉన్న నేపథ్యంలో పోరాటం ఉధృతం చేస్తామని అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు పార్వతీపురం ఐటిడిఎ ఎదుట చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు 18వ రోజు శనివారం కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం అంబేద్కర్, గాంధీ, అల్లూరి, భగత్ సింగ్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. మంగళవారం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు, గురువారం చలో ఐటిడిఎ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

మంత్రికి వినతి

జిల్లా పర్యటనకు వచ్చిన పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు శనివారం గిరిజన సంక్షేమ గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు వినతిపత్రం అందజేశారు. డిఎస్‌సి నుంచి గిరిజన గురుకుల పాఠశాల ఉపాధ్యాయ పోస్టులు మినహాయించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, దివాకర్, రాజేష్, వెంకట్, తిరుపతి నాయుడు, గున్నమ్మ, రమణ, లక్ష్మి, జ్యోతి, బిందు, ఉమా, తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన ఆసుపత్రి భవనాన్ని పరిశీలిస్తున్న డిఇఇ ప్రసన్న కుమార్

భద్రగిరి ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం వెనుక భాగంలో నిర్మిస్తున్న వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణ పనులు పూర్తి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎపిఎంఎస్ఐడిసి డిఇఇ ప్రసన్నకుమార్ శనివారం ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. వైసిపి హయాంలో రూ.8.95 కోట్ల నిధులు ముజురయ్యాయి. రూ.2.04 కోట్లతో పనులు కొంతమేర పూర్తయ్యాయి. గత కొన్నేళ్లుగా ఆస్పత్రి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఈ ప్రాంతంలో మరింత మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, నిర్మాణ పనులు కొనసాగేలా దృష్టి సారించారు. మార్చి నాటికి ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తి కావాలని సంబంధిత అధికారులకు ఆమె ఆదేశించారు. దీంతో పనులను డిఇఇ ప్రసన్నకుమార్ పరిశీలించారు.

ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొన్న లారీ

- డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు
- భారీగా నిలిచిపోయిన వాహనాలు

ప్రజాశక్తి-కొమరాడ

ఆంధ్రా-ఒడిశా అంతర్రాష్ట్ర రహదారిపై కొమరాడ వద్ద ఆగి ఉన్న లారీని శనివారం ఉదయం మరో లారీ ఢీకొంది. విశాఖపట్నం నుంచి రాయగడ వైపు బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ ఢీకొనడంతో క్యాబిన్ నుజ్జయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రెండు లారీలు రోడ్డుకు అడ్డంగా ఆగిపోవడంతో సుమారు ఆరు గంటల వరకు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పార్వతీపురం నుంచి క్రేన్‌ను ఎస్ఐ నీలకంఠం తెప్పించి, లారీలను తొలగించారు. ట్రాఫిక్ స్తంభించడంతో విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ ఘటనపై కొమరాడ పోలీసులు కేసు నమోదుచేశారు.

నుజ్జునుజ్జయిన లారీ క్యాబిన్

ప్రజాశక్తి ఏజెంట్ అకాలమృతి

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండలో ప్రజాశక్తి ఏజెంట్‌గా 20 ఏళ్ల నుంచి సేవలు అందిస్తున్న విజయకుమార్ (58) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. శుక్రవారం ఇంటి వద్ద తీవ్ర గుండెపోటుకు గురైన ఆయనను కుటుంబసభ్యులు శ్రీకాకుళం జెమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందారు. ఆయన మృతికి ప్రజాశక్తి జిల్లా మేనేజర్ సిహెచ్.రాము, డిఒ మల్లేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణరావు, నాయకులు రాము, లక్ష్మణరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు హిమప్రభ సంతాపం తెలిపారు.

ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ రామచంద్రరావు

ఆరోపణలపై చర్యలు తీసుకుంటాం

డ్వామా పీడీ రామచంద్రరావు

ప్రజాశక్తి-సీతంపేట

సామాజిక తనిఖీలో వచ్చిన ఆరోపణలపై చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ రామచంద్రరావు తెలిపారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో సామాజిక తనిఖీ ప్రజావేదికను డ్వామా పీడీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో 13 మంది డిఆర్‌పిలు, ఇద్దరు ఎస్ఆర్‌పిలు దాసు, మాధవరావు.. నవంబర్ 20 నుంచి ఈ నెల 6 వరకు ఉపాధి హామీ ద్వారా చేపట్టిన పనులపై తనిఖీలు చేపట్టారు. మండలంలోని 53 పంచాయతీల్లో ఉపాధి హామీ ద్వారా 2023 - 24లో చేపట్టిన 3986 పనులకు 31.18 కోట్లు, మెటీరియల్‌కు రూ.8.59 కోట్లు.. మొత్తం రూ.39.78 కోట్లు ఖర్చుచేసినట్లు ప్రజావేదికలో వెల్లడించారు. అనేక చోట్ల వేతనదారుల మస్టర్‌లో సంతకాలు, వేలిముద్రలు లేకుండా వేతనాలు చెల్లించినట్లు సామాజిక తనిఖీ బృందాల సభ్యులు.. అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. హార్టికల్చర్ ద్వారా అందించిన మొక్కలు చనిపోయాయని తెలిపారు. చేసిన పనుల్లో కొలతలు తేడాలు ఉన్నాయని వివరించారు. పనులు జరిగే చోట బోర్డులు లేవని తెలిపారు. ఐటిడిఎ ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ విభాగం ద్వారా చేపట్టిన కొన్ని రహదారుల అంచనాల్లో బిటి రోడ్డు అని రాసి, సిసి రోడ్లు వేశారని వెల్లడించారు. ఈ సందర్భంగా పీడీ స్పందిస్తూ సామాజిక తనిఖీలో వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గీతాంజలి, ఎపిడి శ్రీహరి, ఎపిఒ సాగర్, ఇసి పాండురంగ, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలు భూదందాలు బయటపడేనా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఏళ్ల తరబడి ఉన్న భూ సమస్యలు పరిష్కరిస్తామంటే ఎవరికి మాత్రం ఆత్రం ఉండదు. ఇప్పటికే తాము ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కరించేందుకు రైతులు, సాధారణ ప్రజానీకం కాళ్లు అరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ, ముఖ్యంగా కలెక్టరేట్‌లోని ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తిరుగుతున్నారు. మరికొంతమంది ప్రభుత్వ, అటవీ భూములు, చెరువులు కబ్జాకు గురయ్యాయని ఫిర్యాదులు చేస్తున్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను అడ్డం పెట్టుకుని కూడా భోగాపురం, పూసపాటిరేగ తదితర మండలాల్లో ప్రభుత్వ ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు వశపర్చుకున్నట్టు వార్తలు వస్తున్నాయి. గతంలో పేదలు, దళితులు, గిరిజనులకు ఇచ్చిన అసైన్డ్ భూములను కూడా చాలా మంది పెత్తందారులు తమ ఆదీనంలోకి తెచ్చుకున్నారు. ఇంకా చెప్పాలంటే రాజకీయ జోక్యం, అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రభుత్వ భూములపై ఉన్న 22ఎను ఎత్తివేశారు. ఇలా భూముల పరిరక్షణ కోసం ఎన్నో చట్టాలు ఉన్నా వాటిలో లొసుగులను తమకు అనుకూలంగా మార్చు కుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకించి రెవెన్యూ రికార్డుల పరిశీలన, భూ వివాదాలపై వినతుల స్వీకరణ కోసం గత ఆగస్టులో ప్రత్యేకించి మన జిల్లాకు ఏకంగా రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా రావడం అభినందనీయమే. కానీ, రికార్డులను ప్రక్షాళన చేయడంతోపాటు భూ సమస్యలను పరిష్కరించేందుకే వచ్చానంటూ సిసోడియా చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారులు కూడా ఇదే విషయాన్ని నొక్కి చెప్పారు. ప్రస్తుతం గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులు కూడా జరుగుతున్నాయి. ఈ సదస్సుల్లో భూ సమస్యలన్నీ పరిష్కరిస్తామంటూ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన మంత్రులు, కలెక్టర్లు, జెసిలు ఇతర అధికారులు శెలవిస్తున్నారు. ఈనేపథ్యంలో ఒకటి అర ప్రజలు విన్నవించుకున్న సమస్యలను పరిష్కరించి మమా అనిపిస్తారా? లేక బడాబాబుల ఆటలు కట్టించే వరకు కొనసాగుతుందా? అన్నది చాలా మంది నోటి వినిపిస్తున్నా మాట. గత ప్రభుత్వంలో జరిగిన భూ కబ్జాలు, రీ సర్వే, జగనన్న కాలనీలు తదితర పేర్లతో సేకరించిన భూమి కొనుగోలు, చెల్లింపులు వ్యవహారాలకే పరిమితమౌతుందా? అన్నది కూడా పబ్లిక్ టాక్. వాస్తవానికి గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల పేరిట పనికి రాని భూములను రూ.కోట్లు చెల్లించి కొనుగోలు చేశారు. దీంతో, చాలాచోట్ల ఇళ్ల పట్టాలు తీసుకునేందుకు కూడా లబ్ధిదారులు ముందుకు రాలేదు. రాష్ట్రంలోనే అతి పెద్దదిగా గుర్తింపు పొందిన గుంకలాం లేఅవుట్ స్థలం కొనుగోలు మొదలుకుని, కేటాయింపుల వరకు అవినీతి జరిగిందని అప్పట్లో సాక్షాత్తు అధికార పార్టీ నాయకులే బహిరంగ చర్చకు తెరలేపారు. అటు పార్వతీపురం జిల్లా కేంద్రంలోని పేదలకు పెదమరికి కొండవాలు ప్రాంతంపై స్థలాలు ఇచ్చారు. వీటితోపాటు అనేక చోట్ల రూ.కోట్ల అవినీతి జరిగిందన్నది అప్పట్లో బహిరంగ చర్చ నడిచింది. మరోవైపు 20ఏళ్లకు మునుపు పొందిన అసైన్డ్ భూములను సంబంధిత దళితులు, ఇతర వెనుకబడిన తరగతుల పేదలకు రెగ్యులర్ చేస్తామంటూ గత ప్రభుత్వం జిఒ జారీచేసిన సంగతి తెలిసిందే. ఆచరణలో వాటిలో ఎక్కువ భాగం అప్పటి ప్రభుత్వంలోని అధికారులు, నాయకులే కొనుగోలు చేసినట్టు విమర్శలు వచ్చాయి. పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో కొన్ని దందాలు, అక్రమ కొనుగోళ్లు రెండు నెలల క్రితం ప్రజాశక్తి వెలుగులోకి తెచ్చిన సంగతి కూడా తెలిసిందే. ఇంకా లోతుల్లోకి వెళ్తే దళితుల పేరున ఉన్న అసైన్డ్ భూములను రికార్డుల్లో తారుమారు చేశారు. ఇటువంటివి మెంటాడ, వేపాడ మండలాల్లో కొకొల్లాలుగా ఉన్నాయి. గిరిజన ప్రాంతంలో పెత్తందారుల ఆక్రమణలకు అడ్డూ ఆపూ లేకుండా పోయింది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, రాజకీయ జోక్యం, పార్టీల ప్రమేయం పక్కనబెట్టి ఈ భూ ఆక్రమాలన్నీ వెలికి తీయాలని, పేదలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జనం చర్చించు కుంటున్నారు. కేవలం గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలపైనే చర్చ నడిస్తే అది కేవలం కక్ష సాధింపుగానే మిగిలిపోతుంది తప్ప, పేదలకు ఒరిగిందేమీ లేదని కూడా పబ్లిక్ టాక్.



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం శనివారం పండగ వాతావరణంలో జరిగింది. పాఠశాలలను రంగవల్లులతో విద్యార్థులంతా సుందరంగా అలంకరించారు. మామిడితోరణాలు, అరటి మొక్కలతో స్వాగత ద్వారాలు ఏర్పాటుచేశారు. పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులకు విద్యార్థులు, ఉపాధ్యాయులు సాదర స్వాగతం పలికిన నుంచి మధ్యాహ్నం పసందైన భోజనం వరకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను, పాఠశాలతో ఉన్న అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థుల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. తల్లిదండ్రులకు ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించారు.

ఎన్నో ప్రత్యేకతలు... ఎంతో వైవిధ్యం

- తల్లిదండ్రులకు ఆటల పోటీలు
- అలరించిన పూర్వ విద్యార్థుల నృత్యాలు
- పిల్లలతో సహపంక్తి భోజనం చేసిన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

గుమ్మలక్ష్మీపురంలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

విద్యార్థులకు మార్గదర్శులు తల్లిదండ్రులేనని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలోని డివిఎం పురపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటుచేశారు. పిల్లలు పాఠశాల నుంచి ఇళ్లకు వచ్చాక ఇచ్చిన హోం వర్క్ చేస్తున్నారా, చదువుతున్నారా? లేదా? అని విద్యార్థుల తల్లిదండ్రులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల పట్ల ఎటువంటి అనుమానాలు ఉన్నా ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని కలెక్టర్ చెప్పారు. పిల్లలు ఇంటి వద్ద చదువుతున్నారా, ఫోన్‌లో ఏమైనా వీడియోలు చూస్తున్నారా? అని గమనించాలని తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాల ఎలా ఉంది, ఉపాధ్యాయులు పాఠాలు అర్థమయ్యేలా చెబుతున్నారా? లేదా అని విద్యార్థులను అడిగారు. తాను ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని, అప్పుడు అన్ని సౌకర్యాలు ఉండేవి కాదని కలెక్టర్ తన అనుభవాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.గోవిందరెడ్డి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు. టిఆర్ఎంఎం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌కు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శోభారాణి పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భద్రగిరి పిటిజి గురుకుల పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. పిటిజి గురుకుల పాఠశాలలో క్రీడలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట సిఐ హరి, ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి, ఎంపిడిఒ సల్మాన్‌రాజు, తహశీల్దార్ శివన్నారాయణ, ఎస్ఐ బిడ్డిక శివప్రసాద్, ఎంఇఒ చంద్రశేఖర్, హెచ్ఎం బిడ్డిక భీముడు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సొంటేన రాజేష్, టిడిపి మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, సీనియర్ నాయకులు మండంగి భూషణ, సర్పంచ్ బొత్తాడ గౌరీశంకర్ రావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట : విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆకాంక్షించారు. ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పెద్దూరు ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశానికి ఎంపిపి బి.ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి హాజరయ్యారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కె.సరస్వతి, సర్పంచ్ ఆదిలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు టి.చంద్రరావు, ఎస్.ప్రసాద్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు నెల్లి సత్యనారాయణ, విద్యా కమిటీ చైర్మన్ కె.చిట్టెమ్మ, డిప్యూటీ వార్డెన్ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు. హడ్డుబంగి ఆశ్రమ పాఠశాల పేరెంట్స్ మీట్‌కు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. సీతంపేట సామర్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో డిడి అన్నదొర, దోనుబాయి ఆశ్రమ పాఠశాలలో సర్పంచ్ వెంకటనాయుడు, వైద్యాధికారి భానుప్రతాప్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భాస్కరరావు, ఎటిడబ్ల్యుఒ మంగవేణి, హెచ్‌డబ్ల్యుఒ పాలక అమల, లక్ష్మి, డిప్యూటీ డిఇఒ నారాయుడు, ఎంఇఒ ఆనందరావు, ఎంఎం కోటి బాబు, ఎస్ఐ వై.అమ్మన్నరావు, పాఠశాల హెచ్ఎం బి.ఉమావాణి, డిప్యూటీ వార్డెన్ మల్లిక పాల్గొన్నారు.

కురుపాం : కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పేరెంట్స్ వేడుకల్లో ఎంపిడిఒ ఉమామహేశ్వరి, ఎస్ఐ నారాయణరావు, ఆదర్శ పాఠశాలలో వేడుకల్లో ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

కొమరాడ : స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్, అంబేద్కర్ బాలికల పాఠశాల, గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌కు ఎంపిపి శెట్టి శ్యామల, మండల ప్రత్యేక అధికారి రాజశేఖర్ రెడ్డి హాజరయ్యారు. మండలంలో నిర్వహించిన కార్యక్రమాల్లో జెడ్‌పిటిసి డి.లక్ష్మి, వైసిపి మండల

సీతానగరంలో ఎమ్మెల్యే విజయ్‌చంద్రకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

కన్వీనర్ జనార్ధనరావు, ఎంఇఒ నారాయణస్వామి, తహశీల్దార్ శివయ్య, ఎంపిడిఒ మల్లికార్జునరావు, ఎంపిటిసి సభ్యులు దేవకోటి వెంకటనాయుడు పాల్గొన్నారు.

సీతానగరం : విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. మండలంలోని లచ్చయ్యపేట ప్రాథమిక పాఠశాలలో మెగా పేరెంట్స్ డే సమావేశంలో ఆయన మాట్లాడారు. పెదంకలాం ప్రాథమిక పాఠశాలలో ఎంపిపి బి.రమణమ్మ, మండల ప్రత్యేక అధికారి కె.కరుణాకర్, ఎంపిడిఒ త్రివిక్రమరావు, బూర్జ హైస్కూల్లో ఎంఇఒ జి.సూరిదేముడు, సీతానగరం హైస్కూల్లో జెడ్‌పిటిసి ఎం.బాబ్జి, బి.శ్రీరాములనాయుడు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ వి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ మీట్‌లో డిప్యూటీ డిఇఒ పర్రి కృష్ణమూర్తి మాట్లాడారు. హెచ్ఎం జి.పరాంకుశం నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్, వార్డు కౌన్సిలర్ ప్రతినిధులు పడాల రాంబాబు, ఆకుల కుమార్ , కోలా లక్ష్మి, ఎస్ఎంసి చైర్‌పర్సన్ పేకేటి రామలక్ష్మి, వైస్ చైర్మన్ నక్కిని శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

భామిని : విద్యార్థులు లక్ష్యంతో విద్యను అభ్యసించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. భామిని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రంథాలయాన్ని పరిశీలించి, పుస్తకాల కోసం రూ.10 వేలు అందజేశారు. భామినిలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు కోసం

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

విద్యాశాఖ మంత్రి దృష్టిలో ఉంచామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రవినాయుడు, ప్రధాన కార్యదర్శి ఎం.జగదీశ్వరరావు, ఆదర్శ పాఠశాల చైర్మన్ వానపల్లి రవి, సర్పంచ్ లోపింటి రాజేష్, ప్రిన్సిపాల్ ఆర్. శివకుమార్, బిడ్డికి ప్రసాద్, ఎంపిటిసి విష్ణు, తహశీల్దార్ అప్పారావు, గురిబిల్లి లక్ష్మి పతి, జనసేన మండల అధ్యక్షులు రుంకు కిరణ్ పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని కంబర వలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ సమావేశంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, వీరఘట్టం హైస్కూల్లో ఎస్ఐ జి.కళాధర్ పాల్గొని మాట్లాడారు.

భోజనం బాగోలేదన్నా పట్టించుకోరా?

పాచిపెంట : స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటుచేసిన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో గందరగోళంగా మారింది. ఈ సమావేశానికి ఎస్ఎంసి చైర్మన్ ఎడ్ల రమేష్, టిడిపి మండల అధ్యక్షులు పిన్నింటి ప్రసాదబాబు హాజరయ్యారు. వంట నిర్వాహకుల తీరుపై పిల్లల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వాహకులు సక్రమంగా అమలు చేయడం లేదని కొన్ని నెలలుగా చెబుతున్నా ఎందుకు పట్టించుకోలేదని హెచ్ఎం బి.ఈశ్వరరావును ప్రశ్నించారు. నిర్వాహకులను తొలగించాలని తీర్మానిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హెచ్ఎం చెప్పారు. దీంతో తల్లిదండ్రులు మరింత ఆగ్రహం వ్యక్తంచేస్తూ, గతంలో ఎన్నోసార్లు తీర్మానం చేశామని, ఇంకా ఎన్నిసార్లు తీర్మానించాలని నిలదీశారు. దీంతో హెచ్ఎంకు, తల్లిదండ్రులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అక్కడే ఉన్న ఎస్ఐ వెంకట సురేష్ వారించినా, పరిస్థితి సద్దుమణగలేదు. చివరికి సమావేశం ముగియకుండా తల్లిదండ్రులు ఇళ్లకు వెనుతిరిగారు. దీంతో మిగతా కార్యక్రమాలన్నీ నిలిచిపోయాయి.

హెచ్‌ఎంను నిలదీస్తున్న తల్లిదండ్రులు

పిల్లల చదువుపై దృష్టి పెట్టండి

మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-మక్కువ

పిల్లల తల్లిదండ్రులు రాత్రివేళలో సీరియల్ చూడటం పక్కనపెట్టి విద్యార్థుల చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో జరిగిన మెగా పేరెంట్స్ మీట్‌లో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన ప్రతిఒక్కరూ ఉన్నత శిఖరాలు చేరుకున్నారన్నారు. ఈ పాఠశాలలో స్కూల్ బెంచీలు, మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు, గదులు ఆధునీకరణకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఇక్కడ విద్యను అభ్యసించిన తాను ఇప్పుడు మంత్రిగా వచ్చి సమావేశంలో మాట్లాడుతున్నప్పుడు పాత జ్ఞాపకాలన్నీ గుర్తుకు వస్తున్నాయని చెప్పారు.

ప్రోటోకాల్ కూడా తెలియదా?

మెగా పేరెంట్స్ మీట్ సందర్భంగా పాఠశాల ఆహ్వాన పత్రంలో పిలిచే క్రమాన్ని సక్రమంగా లేకపోవడాన్ని జెడ్‌పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసరావు ఈ సందర్భంగా ఆక్షేపించారు. కేవలం ఫొటోలకే పరిమితం కాకుండా ప్రజాప్రతినిధులు అభివృద్ధిపై దృష్టిసారించాలన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఎత్తిచూపడం తన ఉద్దేశం కాదని అనడంతో హెచ్ఎం మజ్జి హేమలత సభాముఖంగా క్షమాపణ చెప్పారు. మంత్రి సంధ్యారాణి ఫొటోలకు పరిమితమైన వ్యక్తి కాదని టిడిపి మండల అధ్యక్షులు గుల్ల వేణుగోపాలరావు ఈ సందర్భంగా కౌంటర్ ఇచ్చారు.

టగ్ ఆఫ్ వార్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

రాజకీయ ముసుగు

ప్రభుత్వం రాజకీయాలు జెండాలు, అజెండాలకు తోవ లేకుండా మెగా పేరెంట్స్ మీట్‌ను జరుపుకోవాలని ఉత్తర్వులు ఇచ్చింది. మక్కువలో జరిగిన సమావేశంలో ఆ ఉత్తర్వులను బేఖాతరు చేశారు. మంత్రి సంధ్యారాణిని ఆహ్వానిస్తూ సమావేశంలోని దాసరి కేశవరావు నాయకత్వం వర్థిల్లాలి అంటూ ఫ్లెక్సీలు వెలిశాయి. వీటిపై అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ, ఇదేమిటి రాజకీయ సమావేశమా? అంటూ పలువురు విస్తుపోయారు. కార్యక్రమంలో డిఇఒ తిరుపతినాయుడు, తహశీల్దార్ షేక్ ఇబ్రహీం, ఎంపిడిఒ డిడి స్వరూపరాణి, టిడిపి సీనియర్ నాయకులు ప్రసాదరావునాయుడు, డాక్టర్ పి.మల్లేశ్వరరావు , తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి ; తల్లిదండ్రులకు బహుమతులు అందజేస్తున్న గిరిజన నాయకులు సుందరరావు

మత్తుకు బానిసైతే భవిష్యత్తు చిత్తు : ఎస్‌పి

సాలూరు : విద్యార్థి దశలో పిల్లలు మత్తు పదార్థాలకు బానిసైతే వారి భవిష్యత్తు అంధకారమవుతుందని ఎస్‌పి ఎస్‌వివి మాధవరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదువుకోవాలని కోరారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలపై పోలీసు శాఖ గట్టి నిఘా పెట్టిందని చెప్పారు. తల్లిదండ్రులు కూడా పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ జర్జాపు ఈశ్వరరావు, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిఎన్ బొడ్డవలసలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మెగా పేరెంట్స్ మీటింగ్ సందర్భంగా ఎఎస్‌పి దిలీప్ కిరణ్ తల్లిదండ్రులు, విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమం గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులదే కీలకపాత్ర

సాలూరు : పిల్లల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులే కీలకపాత్ర పోషించాలని గిరిజన నాయకులు రాయల సుందరరావు అన్నారు. మక్కువ మండలం వైఎస్ వలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. స్మార్ట్‌ఫోన్లకు అతుక్కుపోవద్దని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదువుపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తల్లిదండ్రులతో టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించారు. హెచ్ఎం ఎ.పుష్పనాథం అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలో రెల్ల ప్రధాన రహదారి నుండి పెద్దగూడ వరకు రూ.90 లక్షలతో చేపట్టే నూతన రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పాడి సుదర్శన్‌రావు, నాయకులు మండంగి భూషణ్, ఐటిడిఎ జెఇ అప్పారావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నేడు మంత్రి శంకుస్థాపన

ప్రజాశక్తి-సాలూరు

మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఆదివారం పట్టణంలో శంకుస్థాపన చేయనున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.61.5 లక్షలతో చేపట్టనున్న బిటి, సిసి రోడ్ల నిర్మాణ పనులకు ఆమె భూమి పూజ చేయనున్నారు.

మంత్రిని కలిసిన జనసైనికులు

ప్రజాశక్తి-కురుపాం

జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి నాదెండ్ల మనోహర్‌ను జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె.మల్లేష్ ఆధ్వర్యంలో జనసైనికులు కలిశారు. తుపానుతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేయాలని వారు మంత్రిని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఎస్.వంశీ, వి.శివ, వాన ఉపేంద్ర, గార గౌరీ శంకర్ పాల్గొన్నారు.

జింక మృతి

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని తూడి గ్రామ సమీపంలో శనివారం జింక మృతిచెందింది. ఈ విషయాన్ని అటవీశాఖ సెక్షన్ అధికారి రవిబాబు.. పశువైద్య శాఖ అధికారి చైతన్యశంకర్‌కు తెలియజేశారు. ఆయన ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం చేశారు. తిన్న ఆహారం అరగకపోవడంతో మృతిచెందినట్లు నిర్ధారించారు. అనంతరం జింక కలేబరాన్ని దహనం చేశారు.

మృతిచెందిన జింక

సీతంపేట, భామినిలో సిపిఎం జిల్లా మహాసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-సీతంపేట

ఈ నెల 10, 11న కురుపాంలో జరిగే సిపిఎం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకులు ఎం.తిరుపతిరావు కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ.భాస్కర్‌రావు, ఎం.కాంతారావు, పి.సాంబయ్య, పి.వీరన్న, జె.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

భామిని : సిపిఎం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలం కన్వీనర్ కొప్పర మిన్నారావు కోరారు. మండలంలోని ఘనసరలో శనివారం జిల్లా మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జగన్నాయకులు, పుష్ప, తేజ, త్రినాథ్ పాల్గొన్నారు.

లే అవుట్ల పరిశీలన

ప్రజాశక్తి-మక్కువ

గత ప్రభుత్వం మండలంలోని పేదలకు కేటాయించిన జగనన్న కాలనీ లేఅవుట్లను విజిలెన్స్ అధికారి కామేశ్వరరావు పరిశీలించారు. రెండు రోజులుగా ఆయన సుమారు 55 లేఅవుట్లను పరిశీలించారు. అక్కడ లబ్ధిదారులతో మాట్లాడి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఇ సింహాచలం, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారి కామేశ్వరరావు

ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఏరియా ఆస్పత్రిలో శనివారం సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది 25 యూనిట్ల రక్తదానం చేశారు. అత్యవసర సమయంలో రోగులకు ఈ రక్తం ఉపయోగ పడుతుందని సూపరింటెండెంట్ తెలిపారు. రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఒ శ్రీనివాస్, వైద్య నిపుణులు రాజేష్, రేఖ, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరంలో పాల్గొన్న సూపరింటెండెంట్ శ్రీనివాసరావు , వైద్యులు, సిబ్బంది

బోర్డును సరిచేస్తున్న పోలీసులు

పిచ్చిమొక్కలు తొలగింపు

ప్రజాశక్తి-గరుగుబిల్లి

మండలంలో పార్వతీపురం నుండి బురదండపురం వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న పొదలను, పిచ్చిమొక్కలను శనివారం ఎస్ఐ రమేష్ నాయుడు ఆధ్వర్యంలో తొలగించారు. కార్యక్రమంలో రైటర్ బాబ్జి, పోలీస్ కానిస్టేబుల్ అచ్యుతరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రసామంతవలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలలో శనివారం ఎంఎస్ఆర్ ఫౌండేషన్, పోలీసు శాఖ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 300 మందికి జెమ్స్ ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేశారు. అందులో 30 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుష్పనాథం, ఎంఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వాలీబాల్ కిట్‌ను ఎస్ఐ ఎం.వెంకటరమణ అందజేశారు.

మత్తుపదార్థాలతో అనర్థాలు

ప్రజాశక్తి-పాచిపెంట

మత్తు పదార్థాలతో అనేక అనర్థాలు సంభవిస్తున్నాయని ఎస్ఐ వెంకట సురేష్ తెలిపారు. శనివారం పాచిపెంట, పాంచాలి, కొత్తవలస హైస్కూళ్లలో, గిరిజన సంక్షేమ గురుకులాల్లో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుల్లో ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

వ్యాధి నిరోధక టీకాలతోనే

ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

వ్యాధినిరోధక టీకాలతో ప్రాణాంతక వ్యాధుల నుండి రక్షణ ఉంటుందని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు అన్నారు. శనివారం పట్టణంలోని బెలగాంలో 21వ వార్డులో ఉన్న ఎస్ఎన్‌పి కాలనీ వైద్య సిబ్బంది నిర్వహించిన టీకా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. టీకాలకు అర్హులైన పిల్లల, గర్భిణుల వివరాలు రికార్డులో షెడ్యూల్ ప్రకారం ఎంతమందికి వేయాల్సి ఉంది, సంబంధిత తేదీలు పరిశీలించారు. వ్యాక్సిన్ క్యారియర్‌లో టీకా వయల్స్, వాటి వివిఎం పరిశీలించి, టీకా పూర్తైన తర్వాత వినియోగించిన సిరంజీల సూదులను వెంటనే హబ్ కట్టర్ సాయంతో కట్ చేయాలన్నారు టీకా కార్డులను తనిఖీ చేసి, అక్కడ టీకా వేయడాన్ని గమనించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలకు వారి వయస్సు ను బట్టి వేయాల్సిన వ్యాధినిరోధక టీకాలు సకాలంలో వేయాలని తద్వారా పోలియో, క్షయ, హెపటైటిస్, అతిసారా, న్యుమోనియా, కోరింత దగ్గు, కంఠసర్పి, దనుర్వాతం, తట్టు, రుబెల్లా, దృష్టి సమస్యలు, తదితర ప్రాణాంతక వ్యాధులకు గురికాకుండా రక్షణ కల్పిస్తాయని చెప్పారు. అంగన్వాడీ పిల్లల హెల్త్ స్క్రీనింగ్ ఏ మేరకు పూర్తి చేశారని అడిగి స్క్రీనింగ్ వివరాలు పరిశీలించారు. తల్లిదండ్రులతో మాట్లాడి చలికాలంలో పిల్లల ఆరోగ్య పరంగా తీసుకోవలసిన జాగ్రత్తలు,సలహాలు సూచించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ పిహెచ్‌సి వైద్యాధికారి రవిచంద్ర, ఆరోగ్య పర్యవేక్షకులు పుష్ప, జయగౌడ్, ఎఎన్ఎం ఉమ పాల్గొన్నారు.

ఆహార ఉత్పత్తులు పండించాలి

ప్రజాశక్తి - కురుపాం

ఆహార ఉత్పత్తులను నేరుగా గ్రామాల్లో రైతులు పండించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ పి.షణ్ముఖ రాజు అన్నారు. శనివారం మండలంలో దురిబిలి గ్రామంలో గాయత్రి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుడ్ బాస్కెట్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జిల్లాలో మార్కెటింగ్ టీమ్ ద్వారా పసుపు, బెల్లం, సామలు, కొర్రలు, గంటెలు, వేరుశనగ, మినప గుళ్లు, బాదణి కారం, ఆయిల్, రాగులు, రాగిపిండి, చిరుధాన్యాలు రైతులకు అందజేశారు.

చిరుధాన్యాలను అందజేస్తున్న మేనేజర్ షణ్ముఖరాజు